# ఈ వారం కథ

ఆహ్లాదపరిచే మాట తీరు కొంతమందికే ఉంటుంది. ఎవరూ నొచ్చుకోకుండా మాట్లాడటం కూడా ఒక కళే.

కాని చాలామంది ఎదుటి వాళ్ళను ఈసడిస్తూనో, వంకలు పెట్టో మురిసిపోతూ అదే మాటకారితనం అనుకుంటారు. మరి కొందరేమో ఎదుటి వాళ్లను విపరీతంగా పొగుడుతూ (చిన్నబుచ్చుతూ...!) తమ గొప్పని పదేపదే పరోక్షంగా చెబుతూ వింత ఆనందాన్ని అనుభవిస్తారు. ఈ రకపు మాటకారులకు తమ గొప్పతనాన్ని ఇతరులు మెచ్చుకోవాలనే తాపత్రయం ఎంతుంటుందో... తమ గొప్పతనాన్ని చూసి ఇతరులు చిన్నబుచ్చుకోవాలనే తపన కూడా అంతే ఉంటుంది.

అలాంటి మాటకారుల్లో ఒకడు మా వెంకటపతి మావయ్య!

ఆ రోజు ఆదివారం కావటంతో ఇంట్లోనే ఉన్నాను. పెరట్లో మొక్కలకి పాదులు చేస్తుంటే అమ్మ వచ్చి చెప్పింది... మావయ్య వచ్చాడని. హాల్లోకి వెళ్లాను. నన్ను చూడగానే... 'ఎలా ఉన్నావే కోడలా!...' అని అడిగి, నా మెడ వైపు పరీక్షగా చూస్తూ... 'నీ మెడలో చెయిను కొత్తదాన్లా ఉంది?...' ముఖం ప్రశ్నార్థకంలో మార్చి అడిగాడు.

'అవును మావయ్యా... కొత్తదే' అన్నాను.

'ఓ నాలుగు కాసులుంటుందా?...' ఆ చెయిను చూడగానే ఎవరికైనా అన్పిస్తుంది... కాసున్నర మించి ఉండదని! కాని అంచనా వేయగలిగి కూడా అలా అడగడం తన మాట కారితనం అనుకుంటాడు మావయ్య.

'లేదు మావయ్యా... కాసున్నరే'

'మొత్తానికి బంగారం ధర ఆకాశంలో ఉన్నప్పటికీ కొనేస్తున్నావు. మీకేంటే... చెప్పు! మొన్నామధ్య మీ అత్తయ్య పదిహేను కాసులు కొంది. పలకసర్లు చేయించుకుంటుందంట. దానికి తక్కువ బంగారంతో చేయించినవేవీ ఆనవు. దిట్టంగా ఉండాలి అంటుంది...' నవ్వేడు మావయ్య.

ఆ నవ్వులో ఎన్నో అర్థాలు! అన్నీ అర్థాలు అర్థం చేసుకున్న నేను చాలా తేలిగ్గా నవ్వి 'పిండి కొద్దీ రొట్టె కదా మావయ్యా...' అన్నాను.

వెంకటపతి మావయ్య మా అమ్మకు ఒక్కగానొక్క అన్నగారు. కొడుకు మీద అమితమైన ప్రేమగల తాతయ్య... కూతురైన మా అమ్మను... కట్నం అడగని నాన్నకిచ్చి చేశాడు. మా నాన్న లారీ డ్రైవర్. ఆస్తి లేకపోయినా మంచి వ్యక్తిత్వం కలవాడవటంతో అమ్మ నాన్నతో సంతోషంగానే జీవిస్తోంది.

నేను డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తూ నెలకు రెండు వేలు సంపాదిస్తున్నాను. నా చెల్లెలు టెన్త్ చదువుతోంది.

మా అమ్మ మిషను కుడుతుంది నాన్న తెచ్చే డబ్బుతో పొదుపుగా ఇల్లు నడుపుతుంది. మేం ఉంటున్న ఈ మూడు గదుల పెంకుటిల్లు మా అమ్మానాన్నల రెక్కల కష్టం!

తాతయ్య ఆస్తి మొత్తం కొడుక్కే రాసి నాలుగేళ్ల క్రితమే చనిపోయారు. పొలం, ఇల్లు, రైస్ మిల్లు... మావయ్య ఆస్తి విలువ కోటి రూపాయల పైమాటే. అదంతా తనొక్కడే అనుభవిస్తున్నందుకు మా అమ్మకు మాకు బాధ లేకపోయినా... ఎప్పుడైనా కలిసినప్పుడు కూడా... ఆప్యాయత, అనురాగం లాంటివి లేకుండా ఎకసెక్కెంగా... మేం బాధపడేలా మాట్లాడటమే కోపం కలిగిస్తోంది.

అమ్మ దగ్గర చేరాడు మావయ్య.

నేనూ అక్కడే కూర్చుని చక్రంలో బిగించి ఉన్న చీర అందుకుని ఎంబ్రాయిడరీ చెయ్యసాగాను.

'నీ కూతురు ఉద్యోగం చేస్తోందిట కదా! జీతం ఏ మాత్రం ఉంటుందేమిటి?'

'రెండువేలు ఇస్తున్నారన్నయ్యా...' అంది అమ్మ.

'రెండు వేలే! బానే ఇస్తున్నారు. నీ మేనకోడలు సంధ్య కూడా బిఎస్‌సి పూర్తి చేసింది. ఉద్యోగం చేస్తానంది. కాని పెళ్ళి కావలసిన పిల్ల. పదిమంది మగాళ్ళ మధ్య పని చేయడం ఎందుకని వద్దన్నాను...'

'మీ పరిస్థితికి మా పరిస్థితికి తేడా ఉంది కదన్నయ్యా...' నవ్వింది అమ్మ.

అమ్మ తన గొప్పని ఒప్పుకోగానే మావయ్య ముఖంలో తళుక్కున మెరిసిన మెరుపు నా దృష్టి దాటిపోలేదు.

'సంధ్యకి పదెకరాల పొలం



## మాట 'తీరు'

**- పెన్మెత్స శ్రీకాంత్‌రాజు**

కట్నంగా ఇద్దామనుకుంటున్నాను. నా ఆస్తంతా నా పిల్లలిద్దరికీ చెరి సగం ఇస్తాను. మంచి సంబంధాలు వస్తున్నాయి. డాక్టర్లు, ఇంజనీర్లు, బాగా ఆస్తిపరులు వస్తున్నారు. నీ పెద్దకూతురికి కూడా పెళ్లీడు వచ్చింది కదా! మరి పెళ్ళి గురించేమయినా ఆలోచించారా?'

'ఏదైనా మంచి సంబంధం మాకు తగ్గది వస్తే చేసేస్తాం...' అంది అమ్మ.

'ఈ రోజుల్లో కట్నాలు ఆకాశాన్ని అంటిపోతున్నాయి. లక్షా రెండు లక్షలకి ఆటో డ్రైవర్లు కూడా రావటం లేదు. మన బోటివాళ్లకి పెళ్ళి కుదరటం కూడా కష్టమే. 'మన' అనే మాటను ఒత్తి పలుకుతూ దిగులుగా అన్నాడు మావయ్య.

'దానికెలా రాసుంటే అలా జరుగుతుంది...' తేలిగ్గా తేల్చేసింది అమ్మ.

అమ్మ నా పెళ్లికి అంత ప్రాముఖ్యత ఇవ్వకపోవటం మావయ్యని చాలా నిరాశకు గురిచేసినట్టు ఆయన ముఖం చూస్తే అర్థమవుతుంది.

'అయ్యో... ఇప్పుడు నా పిల్ల పెళ్ళి చేయటమెలా?' అని అమ్మ కన్నీళ్లు పెట్టుకుంటే మావయ్య మనసు ఆనంద డోలికల్లో తేలియాడేది. అయినా వెంకటపతి మావయ్య ఆ విషయాన్ని అంత తేలిగ్గా వదిలేస్తాడా?

'నీకు బాగా ముందు జాగ్రత్త ఎక్కువ. బాగానే నిలవేసి ఉంటావు. ఏ మాత్రం కూడబెట్టేవు కూతురి పెళ్ళి కోసం?' ఆరాగా అడిగేడు మావయ్య.

'నాలుగేళ్ళ క్రితం వరకు ఈ ఇల్లు కట్టుకోటానికి చేసిన అప్పు తీర్చటానికే సంపాదన సరిపోయేది. ఈ మధ్యనే పిల్లలిద్దరికీ చెరో ఐదొందలు పోస్టాఫీసులో కడుతున్నాను. మా రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లల్ని పెంచాం. నాకేమయినా పుట్టింటి ఆస్తా? అత్తింటి ఆస్తా? పిల్లలిద్దరూ చదువుకుంటూ సంస్కారవంతులుగా మసలుతున్నారు. కంతటి తగ్గ బొంతలా వాళ్లకి తగ్గ వాళ్లెవరో రాక పోరూ...' నవ్వుతూనే అంటించింది అమ్మ.

'ఆ... ఏం ఆస్తులులే? పేరుకే ఆస్తి... రాబడేమీ ఉండటం లేదు. నా ఇంట్లో అన్నీ తినే చేతులే! సంపాదించే చేతులు లేవు. మీ ఇంట్లో చూడు లక్షణంగా ముగ్గురూ సంపాదించేస్తున్నారు. ఆస్తులు లేవన్న మాటే కాని... నీకొచ్చిన లోటేం ఉంది?'

ఆఖరి మాట కరెక్టుగా అన్నాడు మావయ్య.

'ఎవరి ఇబ్బందులు వాళ్లవిలే అన్నయ్యా...' అంది అమ్మ ముక్తసరిగా.

'ఏది... చిన్నది కనపడదు'

'పరీక్షలు జరుగుతున్నాయి. ట్యూషన్‌కు వెళ్ళింది...'

'నీ పిల్లలకే నయం... ఇద్దరికీ చక్కగా చదువులబ్బాయి. మా ఆడపిల్లా బానే చదివింది. మగ వెధవకే చదువబ్బలేదు. అచ్చోసిన ఆంబోతులా ఊరు మీద తిరగడం తప్పిస్తే... ఓ పది రూపాయలు సంపాదించి తండ్రి చేతిలో పోద్దామన్న ఇంగితం లేదు వెధవకు. వాడి తోటి వాళ్ళంతా బిజినెస్‌లు చేసి లక్షలు సంపాదిస్తుంటే వీడేమో బండిలో పెట్రోలుకు నా దగ్గర చేయి చాస్తుంటాడు. నీ కూతురు చూడు చక్కగా నెలకు రెండు వేలు తెచ్చి నీ ఒళ్లో ఎలా పోస్తోందో... ఈ రోజుల్లో ఆడపిల్లలే నయం. అవును.. ఇక పెద్దది డిగ్రీ తోటి చదువాపేసినట్టేనా?'

'లేదన్నయ్యా... ఎంసిఏ కరస్పాండెన్స్ కోర్సులో చేరింది...'

మావయ్య ముఖం మ్లానమైంది. 'ఆ? చూడూ ఓ చేత్తో సంపాదించేస్తూనే చదువు కూడా పూర్తి చేసేసుకుంటోంది. ఆ చదువు పూర్తయితే చాలా పెద్ద మొత్తం జీతం వస్తుందట కదా'

అమ్మ నవ్వి ఊరుకుంది.

'పనికిమాలిన వెధవ... బేవార్సు వెధవ... చదువు చట్టుబండలు లేకుండా ఏడుస్తున్నాడు... ఆడపిల్లలైనా నీ పిల్లలే నయం...' పళ్ళబిగువున మనసులోని బాధను భరిస్తున్నాడు మావయ్య.

'అందరికీ చదువే రావాలంటే ఎలా అన్నయ్యా? వాడు కూడా ఎందులోనో ఓ దాంట్లో రాణిస్తాడు. అయినా వాడు వ్యవసాయం బాగా చేయిస్తాడని విన్నాను...'

'వాడు చేయించినా... చేయించకపోయినా పండే పంట పండకపోదు... బయట నుండి సంపాదించి తేవడం ప్రయోజకత్వం...' తన మాటే కరెక్ట్ అన్నట్టు తేల్చాడు మావయ్య.

ఇంతలో మా నాన్న వచ్చారు.

'బావున్నావా బావా?' ఆప్యాయంగా పలుకరించారు మావయ్యని.

'ఏం బాగులే బావా! నీకులా అందరూ సంపాదించే ఇల్లా నాది. తిప్పేది చక్రమే అయినా నికార్సయిన రాబడి నీది. నీ అంత బాగా లేను బావా...'

నాన్న ముఖం చిన్నబోయింది. 'స్నానం చేసి వస్తాను' అంటూ బాత్‌రూం వైపు వెళ్ళారు.

'మన రామం బాబయ్య కొడుకు అమెరికా వెళ్ళాడు తెలుసు కదా?' అన్నాడు మావయ్య అమ్మతో.

'ఆ... తెలుసు. ఇప్పుడేం నాలుగేళ్ళయిందిగా వెళ్లి...' అంది అమ్మ.

'అమెరికా నుండి డాలర్లని వరదలా పంపేస్తున్నాడు. రామం బాబయ్య మనూర్లో పదిహేను ఎకరాల మాగాణి కొన్నాడు. హైదరాబాద్‌లో ఐదొందల గజాల స్థలం కొన్నాడు...'

'అహ...'

'రత్నం అత్త కొడుకేమో... రొయ్యల చెరువులు చేసి బాగా గడించేశాడు. ఆ పెంకుటిల్లు తీసేసి మూడంతస్థుల మేడ వేస్తున్నాడు'

'ఊ...'

'అందరూ భలే బాగుపడిపోతున్నారు... నా పనే ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది...' వాపోయాడు మావయ్య.

నవ్వింది అమ్మ.

నేను కూడా నవ్వి అన్నాను. 'ఏదైనా లాటరీ లాంటిది ట్రై చెయ్యి మావయ్యా...'

'నీకలాగే ఉంటుంది.. నాలుగు చేతులా సంపాదించుకుంటున్నారు. వెనకేసుకుంటున్నారు. నువ్వు కులాసాగా జోకులెయ్యకేం చేస్తావు?' అన్నాడు మావయ్య ఉక్రోషంగా.

అమ్మ నా వైపు చూసింది మాట్లాడద్దన్నట్టు. నేను తల వంచుకుని ఎంబ్రాయిడరీ పని కొనసాగించేసాగాను.

'బావ చేసేది లారీ డ్రైవర్ ఉద్యోగమే అయినా నీ పెళ్ళి జరిగిన నాటికి... ఇప్పటికి ఎంత తేడా? ఈ టౌనులో సొంతిల్లు ఏర్పాటు చేసుకోగలిగారు. ఇంట్లోక్కావలసినవన్నీ అమర్చుకున్నారు. పిల్ల కూడా చేతికందొచ్చింది. నా పరిస్థితి అలా కాదే' దిగులుగా అన్నాడు మావయ్య.

'నీ కూతురు కూడా ఉద్యోగం చేస్తానంది అన్నావుగా... పోనీ చెయ్యనియ్యకపోయావు' అంది అమ్మ.

'దానికేం ఖర్మ! పదెకరాల పొలం, పదిలక్షల కట్నం, వంద కాసుల బంగారం దానికిద్దాం అనుకుంటున్నా. మా దగ్గర ఉండేది ఇంకో సంవత్సరమో రెండేళ్లో... ఈ కొద్ది కాలానికి ఉద్యోగం ఎందుకు చెప్పు. పెళ్లయ్యాక అంతా వాళ్లిష్టం. అయినా ఆడపిల్ల సంపాదన మీద ఆశపడటం నాకు చాలా చికాకు...'

నాకు నవ్వొచ్చింది. ఒక పక్క నుండి స్థితి పరుడనని తనకి తనే చెబుతున్నాడు. ఇంకో పక్క సంపాదన లేదని బీదరుపులు అరుస్తున్నాడు.

'అవును. నీ కూతురికేం ఖర్మ! ఉద్యోగం చేయటానికి. కాని, సంపాదన లేదని నువ్వు బాధపడుతున్నావని అన్నాను...' సంజాయిషీ ఇచ్చుకుంది అమ్మ.

'అన్నట్టూ... అడుగుదామని మర్చిపోయాను. మన ఊరి సుందరం మాస్టారి గారి అబ్బాయి... ఈ ఊళ్లో రెండేళ్ళ క్రితం ఐదొందల గజాల స్థలం కొన్నాడట. గజం మూడొందలు చేసి కొన్నది ఇప్పుడు గజం నాలుగు వేలయిందట. ఇక్కడ మీ ఏరియాలో గజం ఎంతుంటుందిప్పుడు?' అడిగేడు మావయ్య నన్ను.

'ఐదు వేలుండొచ్చు...' అన్నాను.

మా అమ్మ వైపు తిరిగి... 'మీరు పదేళ్ళ క్రితం ఎంతక్కొన్నారీ స్థలం' అడిగేడు.

'గజం రెండొందలనుకుంటాను...'

'ఎన్ని గజాలేమిటి?'

'మూడొందల గజాలు...'

'అంటే అరవై వేలక్కొన్నది... పదిహేను లక్షలయిందన్న మాట. అదృష్టమంటే మీదే.. ఆ రోజుల్లో నేను ఓ వెయ్యి గజాలు కొని పడేసుంటే ఈ రోజున ఓ యాభై లక్షలుండి ఉండేవి...' దిగులు పడిపోయాడు మావయ్య.

ఆ దిగులు మాకు పదిహేను లక్షల ఆస్తి ఉన్నందుకో... తను స్థలం కొనక కోల్పోయిన యాభై లక్షల గురించో నాకు అర్థం కాలేదు.

'ఏం మావయ్యా... యాభై లక్షలు పోయినందుకు బాధగా ఉందా?' జాలిగా అడిగేను.

'అవును. మేం కొనుక్కుంటున్నాం... నువ్వు కూడా కొనుక్కోరా పెరుగుతుంది అని మీ అమ్మానాన్నా ఒక్క మాట అనుంటే ఈ రోజు నాకింత నష్టం రాకపోను. మీరీ ఇల్లు కట్టుకున్న రోజుల్లో నేను మూడు లక్షలు పెట్టి పదెకరాల మామిడి తోట కొన్నాను. అది ఇప్పుడు ఎకరం రెండు లక్షలు. అంటే దాని ఖరీదిప్పుడు ఇరవై లక్షలు. అదే డబ్బుతో ఇక్కడ స్థలం కొనుంటే యాభై లక్షలై ఉండేది. ముప్పై లక్షల నష్టం... ప్చ్!' నిజంగా ముప్పై లక్షలు తన జేబులోవి పోయినట్టుంది అతని ముఖం.

ఇంతలో నాన్న స్నానం చేసి వచ్చారు.

'రా బావా! భోజనం చేద్దాం..' అన్నారు నాన్న.

'రండి వడ్డించేస్తాను..' అమ్మ వంటింటి వైపు నడిచింది. కుడుతున్న చీర పక్కన పెట్టి అమ్మ వెనుకే నడిచాను నేను. పీటలు వాల్చి, పళ్ళాలు, మంచి నీళ్ల గ్లాసులు పెట్టి అక్కడే ఉన్నాను. అమ్మ వడ్డిస్తుంటే భోజనం మొదలుపెట్టారు నాన్నా, మావయ్యా.

'మా చెల్లెమ్మ, పిల్లలు ఎలా ఉన్నారు బావా? రైస్ మిల్లు బాగా నడుస్తోందా? తోటలవీ ఎలా ఉన్నాయి' యోగ క్షేమాలడిగేరు నాన్న.

'ఏం పొలాలు, తోటలులే బావా! పనివాళ్ళకెంత గర్వం పెరిగిపోయిందనుకున్నావు? గవర్నమెంటు ఉద్యోగస్తుల్లా ఇన్ని గంటలని లెక్క. పని కూడా అత్తిరిబిస్తిరి పనే! వాళ్లడిగినంతా ఇవ్వాలి. చేసినంతే చేయించుకోవాలి. అసలు పొలం ఉన్నవాడికంటే... ఈ రోజుల్లో పొలంలో పని చేసేవాడి పనే బెటరు. టైంకి వస్తారు. పని పూర్తి చేసిన తక్షణం చేతిలో డబ్బులు పడిపోవాలి. సంపాదించిన దాన్తో జల్సా చేస్తారు. మాకెన్ని టెన్షన్లు? పంట అమ్మేక డబ్బు చేతికి రావాలి. వచ్చిందనుకోవాలి.

ఇక మిల్లంటావా... అదో పేద్ద రామాయణం. ఇది వరకు పనోళ్లంటే చీకటితో వచ్చి... చీకటి పడ్డాక వెళ్లేవోళ్లు. ఇప్పుడా? ఎనిమిదిన్నర దాటితే కాని పన్లోకి రారు. సాయంత్రం ఐదవగానే పని దిగిపోతారు. కలెక్టర్లా జీతాలు ఒకటో తారీఖున ఇచ్చెయ్యాలి. ఓ గంట పనెక్కువ చేస్తే ఓటి కింద డబ్బులివ్వాలి. లేకపోతే లేబరాఫీసరని, అదని.. ఇదని యాగీ చేస్తారు. ఇస్త్రీ బట్టలేసుకుని దొరలకి మల్లే పనుల్లోకి వస్తున్నారు. వచ్చిన లాభం అంతా వాళ్ల జీతాలకీ, ఓటీలకే పోతోంది. వాళ్ల సుఖం నాకే లేదనుకో...' తన గోడు వెళ్ళబోసుకున్నాడు మావయ్య.

నాన్న చిన్నగా నవ్వి అన్నారు. 'అయితే.. నీకన్నా నీ దగ్గర పనిచేసే వాళ్ళ బతుకే బావుందంటావు.'

'మరి కాక...' అన్నాడు మావయ్య. అప్పటికే అతని దృష్టి నాన్న చేతికి ఉన్న చిన్న కెంపు ఉన్న ఉంగరం మీద పడింది.

'ఏం బావా... స్టీరింగే కాక ఇంకా చాలా తిప్పుతున్నట్టున్నావే. మీ లారీ డ్రైవర్లకు పెట్రోలు బంకులు దగ్గర ఆమ్యామ్యాలుంటాయట కదా. నువ్వు అలా పైన బానే సంపాదిస్తున్నట్టున్నావు' మావయ్య మాటల్నిండా అంతులేని అసూయ.

అర్థం కానట్టు చూశారు నాన్న.

'ఎంత సంపాదన లేకపోతే... వేళ్లకి ఉంగరాలొస్తాయి చెప్పు...' చేయి కడుక్కుంటూ వ్యంగ్యంగా నవ్వాడు మావయ్య.

ఇక ఉండలేక పోయాను. వస్తున్న కోపాన్ని అదిమిపట్టి చెయ్యి తుడుచుకోవడానికి మావయ్యకి టవలిచ్చి 'ఇరవై ఐదు సంవత్సరాల నుండి నాన్న ఒక చిన్న యాక్సిడెంటు కూడా చెయ్యకుండా లారీ నడిపినందుకు గాను ఆ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ వాళ్లు వాళ్ళ వ్యవస్థాపక దినోత్సవం నాడు... నాన్నకి చిన్న సన్మానం చేసి ఇచ్చిన ఉంగారం అది!

చాలా సేపట్నుంచీ మేం నీకంటే చాలా సుఖంగా ఉన్నాం అని నిరూపించటానికి అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నావు. నువ్వు అంత కష్టపడనక్కర్లేదు మావయ్యా! నిజంగానే మేం చాలా సుఖంగా ఉన్నాం.

అసంతృప్తి కూడా ఓ రకమైన పేదరికమే. తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న నువ్వు డబ్బున్నప్పటికీ పేదవాడివే. నీ పొలంలో పనిచేసే కూలివాళ్లు... నీ మిల్లులోని పనివాళ్లు నీకన్నా హాయిగా ఉంటున్నారా? అయితే నీ పొలం కూలివాళ్లకి రాసి ఇచ్చేసి అందులోకి నువ్వే కూలికి వెళ్ళి ఆ హాయిని అనుభవించొచ్చు కదా. నీ మిల్లు కూడా పనివాళ్ల పేరున పెట్టేసి, అందులో పనివాడిగా చేరి కలెక్టరులా ఎనిమిదిన్నరకొచ్చి... సాయంత్రం ఐదింటికి ఇంటికెళ్ళిపోవచ్చు. నెలనెలా ఠంచనుగా జీతం కూడా అందుకోవచ్చు. ఆలోచించు...' కూల్‌గా సలహా ఇచ్చాను.

మావయ్య ముఖం ఒక్క క్షణం మ్లానమై మళ్లీ మామూలై పోయింది. వెర్రిదాని వంట చూసినట్టు నా వైపోసారి చూసి మళ్ళీ మొదలుపెట్టాడు. 'మా ఊరి మునసబు గారి కొడుకు రమణ లేడూ... దొంగనోట్లు మార్చి లక్షలు గడించాడు. నలభై లక్షలు పెట్టి చేపల చెరువు కొంటున్నాడు...' మావయ్య మాటలు కొనసాగుతున్నాయి.

నా మాటలు ఆయన మీద ఏ మాత్రం ప్రభావం చూపించలేదని అర్థమై నిర్లిప్తంగా తల తిప్పుకుని కిటికీలో నుంచి చూడసాగాను. అక్కడ బయట, రోడ్డు మీద

కొంతమంది పిల్లలు కుక్కతోకని గొట్టంలో పెట్టి వంకర తీయటానికి ప్రయత్నిస్తున్నారు. గొట్టంలో నుంచి బయటకు తీయగానే తోక యధాస్థితికి వచ్చేస్తోంది. నవ్వొచ్చింది నాకు. ఎందుకంటే కొన్ని క్షణాల క్రితం నేను చేసిందీ అదేగా.

★

రచయిత చిరునామా
పెన్మెత్స శ్రీకాంత్‌రాజు
ఇం.నెం.18-3-29,
సత్తెమ్మ ఆలయ వీధి
అయోధ్యారామపురం
సామల్‌కోట్ - 533 440.